

సోమశిలలో 73.549 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 73.549 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 7,700 క్యూసెక్కుల వంతున వరద వస్తోంది. జలాశయం నుంచి పెన్నానదికి 10,150, ఉత్తరకాలువకు 50, కండలేరుకు 3600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,30,560
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.11,802
మూడు శాతం జీఎస్టీతో	రూ.12,156
నవర (8 గ్రాములు)	రూ.97,248

గరిష్టం/కనిష్టం
32.0 /25.4

వాతావరణం

జిల్లాలో గురువారం అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపుల వాతావరణం ఉంటుంది. బుధవారం గాలిలో తేమ 83 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

కృష్ణపట్నం పోర్టుకు 'రైజింగ్ స్టార్' అవార్డు



అవార్డులను అందుకుంటున్న పోర్టు ప్రతినిధులు

ముత్తుకూరు (పొదలకూరు): క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా తిరుపతిలో బుధవారం నిర్వహించిన 11వ సదస్సులో అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్‌కు రైజింగ్ స్టార్ ఆర్గనైజేషన్ అవార్డును బుధవారం ప్రదానం చేసింది. ఆత్మ నిర్భర్ వికాస్ భారత్‌పై నాణ్యమైన భావనలు, వినూత్న పరిష్కారాలను సమర్పించిన పోర్టు మొత్తం 8 జట్లు బంగారు అవార్డులను గెలుచుకున్నట్లు సీఈఓ జగదీష్‌పటేల్ పేర్కొన్నారు. కన్వెన్షన్లో దేశ వ్యాప్తంగా 85 సంస్థలకు చెందిన 300 జట్లు పాల్గొన్నాయి. కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ హెల్త్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్మెంట్, ఇంజినీరింగ్ ఉద్యోగులు ముగ్గురు వ్యక్తిగత అవార్డులు సాధించారు. కౌశల్‌కుమార్ సింగ్‌కు అత్యుత్తమ నాయకత్వం, నాణ్యతపై నిబద్ధత కోసం చాంపియన్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు లభించినట్లు వెల్లడించారు. నైపుణ్యంలో మధుసూదనరావుకు స్కిల్ చాంపియన్ అవార్డు, మణికంఠకు మార్గదర్శకత్వానికి ఉత్తమ ఫెసిలిటేటర్ అవార్డు లభించాయి.

నుడా వైస్ చైర్మన్‌గా జేసీ



వెంకటేశ్వర్లు

నెల్లూరురూరల్: నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) వైస్ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో నుడా వైస్ చైర్మన్‌గా అప్పటి నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ (ఐఏఎస్) వ్యవహరించారు. అయితే ఆయన ఆర్నెల్ల క్రితం బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు. తాజాగా జాయింట్ కలెక్టర్‌ను నియమించింది.

డీఎస్‌డీఓగా యతిరాజ్ కొనసాగింపు

నెల్లూరు (బృందావనం): జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా ఆర్‌కే యతిరాజ్‌ను కొనసాగిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ద్వారా ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శాప్ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ ఎస్.భరణి ఉత్తర్వులు జారీ చేశారు. యతిరాజ్ ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయన ఉద్యోగ విరమణ తర్వాత జిల్లా క్రీడాప్రాధికార సంస్థలో ఫుట్‌బాల్ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్న పాండు రంగారావును జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా నియామకం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే జరిగిన పొరపాటును సరిదిద్దుకుంటూ ప్రభుత్వం డీఎస్‌డీఓగా ఎతిరాజ్‌నే నియామకం చేసింది.

అడహాక్ పద్ధతిలో పదోన్నతులు



పదోన్నతుల ప్రక్రియ నిర్వహిస్తున్న జెడ్పీ సీఈఓ మోహన్‌రావు

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న సీనియర్ సహాయకులకు అడహాక్ పద్ధతిలో డిప్యూటీ ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించారు. బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియను జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

సర్కార్ డైరెక్షన్.. ఖాకీల ఓవరాక్షన్

- జిల్లాలో పతాక స్థాయికి చేరిన వేధింపులు
- మాజీ మంత్రి నుంచి సోషల్ మీడియా యాక్టివిస్టుల వరకు అరెస్టులు
- 'సాక్షి' మీడియా గొంతు నొక్కేందుకు తప్పుడు కేసులు
- నోటీసుల పేరుతో అర్ధరాత్రి, అపరాత్రి వేళ పోలీసుల హడావుడి
- ఎడిటర్‌కు నోటీసులు ఇచ్చేందుకు హైదరాబాద్ వెళ్లి నెల్లూరు పోలీసులు

జిల్లాలో ఖాకీలు శాంతి భద్రతలను గాలికి వదిలేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పత్రికల్లో వచ్చిన ప్రెస్‌మీట్లను, మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని మాజీమంత్రి కాకాణి నుంచి సోషల్ మీడియా యాక్టివిస్టులపైన అక్రమ కేసులు కట్టి, అరెస్టులు చేసి జైళ్ల పాల్జేశారు. తాజాగా పోలీసులు, స్థానికులు వెలుబుచ్చిన ప్రాథమిక అనుమానాలనే వార్తగా ప్రచురించడాన్ని జీర్ణించుకోలేక 'సాక్షి' పై తప్పుడు కేసులు పెట్టారు. సర్కార్ డైరెక్షన్‌లో పోలీసులు ఓవరాక్షన్ చేస్తున్నారు. అభ్యంతరకర కథనమైతే రిజాయిండర్‌తో వివరణ కోరాల్సిన సంబంధిత శాఖాధికారులపై ఒత్తిడి చేసి కేసులు నమోదు చేయించారు. 'సాక్షి' మీడియా గొంతు నొక్కేందుకు నోటీసుల పేరుతో ఎడిటర్ నుంచి జిల్లా బ్యూరో ఇన్‌చార్జి, మండల రిపోర్టర్ వరకు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అర్ధరాత్రి వేళ కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా హడావుడి చేస్తున్నారు.

సాక్షి టాస్క్‌ఫోర్స్: టీడీపీ నేతల నకిలీ మద్యం గుట్టు రట్టు కావడంతో ప్రభుత్వాన్ని కుదిపేస్తున్న నేపథ్యంలో సర్కార్ పెద్దల డైరెక్షన్‌లో ఖాకీలు 'సాక్షి' జర్నలిస్టులకు వేధింపులు పతాక స్థాయికి చేరాయి. ఈ నెల 6వ తేదీ జిల్లాలోని కలిగిరి మండలం వెలగపాడులో నిర్వహిస్తున్న బెల్టు షాపులో నాలుగు రోజులుగా పూటుగా మద్యం తాగిన ఓ గుర్తు తెలియని వ్యక్తి, నెల్లూరు రూరల్ పరిధిలోని అనుమతి ఉన్న ఓ మద్యం షాపులో మద్యం తాగిన మరో వ్యక్తి మృతి చెందారు. వీరిద్దరూ మద్యం మత్తులోనే ప్రాణాలు విడిచినట్లు పోలీసులు, స్థానికులు వెలుబుచ్చిన ప్రాథమిక అనుమానాలనే వ్యక్తపరుస్తూ ఈ నెల 8న 'నకిలీ మద్యానికి నలుగురి బలి' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇప్పటికే నకిలీ మద్యం మకిలితో ఊబిలో కూరుకుపోయిన ప్రభుత్వ పెద్దలు దీన్ని నుంచి బయటపడడానికి వారు నకిలీ మద్యంతో చనిపోయారంటూ ఎలా రాస్తారంటూ 'సాక్షి' పత్రిక ఎడిటర్ ఆర్. ధనుంజయరెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి సీహెచ్ మస్తాన్‌రెడ్డిపై ఎక్సైజ్ అధికారులపై పోలీసు అధికారులతో ఒత్తిడి చేయించి కేసులు నమోదు చేయించారు. కలిగిరి 'సాక్షి' రిపోర్టర్ ఇంట్లో అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్నావంటూ సోదాలు నిర్వహించారు.

నోటీసులు.. విచారణ పేరుతో వేధింపులు

జిల్లాలో పోలీసుల వ్యవహార శైలి ఆది నుంచి వివాదాస్పదంగా ఉంది. గతంలో హైదరాబాద్‌కు చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్ మునగాల హరీశ్వర్‌రెడ్డి సామాజిక మాధ్యమంలో టీడీపీ మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనితపై పోస్టింగ్‌లు పెట్టారని కోవూరు టీడీపీ ఎస్సీ సెల్ నేత ఫిర్యాదు మేరకు కోవూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మునగాల హరీశ్వరరెడ్డి సామాజిక మద్యమంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తదితరులపై పోస్టులు పెట్టారని నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి చెందిన శశి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతనిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి జైల్లో పెట్టించారు.

- వింజమూరుకు చెందిన పి.శివశంకర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టు పెట్టారని అతనిపై ఉదయగిరి పోలీసులు కేసు నమోదు చేసి జైల్లో పెట్టారు.
- జిల్లాకు చెందిన మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి హైదరాబాద్‌లో తాను పెట్టిన ప్రెస్‌మీట్ వార్త క్లిప్పింగ్‌ను సోషల్ వాట్సాప్‌లో ఫార్వార్డ్ చేశారని, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి అవినీతిపై వెంకటాచలానికి చెందిన ఓ బీజేపీ పెట్టిన ప్రెస్‌మీట్ వీడియోను వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వార్డ్ చేశారని ఆయనపై కేసులు నమోదు చేశారు.
- తాజాగా టీడీపీ నేతల నకిలీ మద్యం తయారీ గుట్టు బయట పడడం, అదే సమయంలో జిల్లాలో మద్యం షాపు, బెల్టుషాపుల వద్ద ఇద్దరు మద్యం మత్తులోనే చనిపోవడంతో స్థానికులు, పోలీసులు వ్యక్తపరిచిన అనుమానాలనే స్పష్టపరుస్తూ 'సాక్షి'లో ఇచ్చిన కథనంపై నెల్లూరు రూరల్, కలిగిరి పోలీస్‌స్టేషన్లలో పోలీస్ అధికారులు 'సాక్షి' జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడంలో అత్యుత్సాహం చూపించారు. విచారణకు హాజరు కావాలంటూ 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డికి నోటీసులు ఇచ్చేందుకు ఈ నెల 12న వేకువజామునే విజయవాడలోని 'సాక్షి' ప్రధాన కార్యాలయానికి చేరుకుని వీరంగం చేశారు. ఆయన అక్కడ అందుబాటులో లేకపోవడంతో బుధవారం హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి వెళ్లి ఉదయం నుంచి సాయంత్రం వరకు హడావుడి చేశారు. నెల్లూరు సాక్షి బ్యూరో ఇన్‌చార్జి మస్తాన్‌రెడ్డి ఇంటికి నోటీసులు ఇచ్చేందుకు నాలుగుసార్లు, వీడియో రికార్డు చేసేందుకు రెండు సార్లు అది కూడా అర్ధరాత్రి తర్వాత, తెల్లవారుజామున కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా తాను నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్ వద్ద చేసిన హడావుడి చేశారు. ఈ నెల 14న నెల్లూరు రూరల్, కలిగిరి పోలీసులు దాదాపు 6 గంటల పాటు సుమారు 129 ప్రశ్నలు సంధించారు.



నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద డీఎస్పీని ప్రశ్నిస్తున్న జర్నలిస్టు సంఘాల నేతలు, వివిధ మీడియా ప్రతినిధులు

తాడేపల్లికి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి, కాకాణి పూజిత



వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి హాజరైన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాకాణి పూజిత

నెల్లూరు (పొగతోట): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ, నెల్లూరు సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర మహిళ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత హాజరయ్యారు.

కిలో సగటు పొగాకు రూ.146.97



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో కిలో సగటు పొగాకు ధర రూ.146.97గా నమోదైంది. బుధవారం 622 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 975 బేళ్లు రాగా 622 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 72981.8 కిలోల పొగాకును విక్రయించగా రూ.10726174 వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్టంగా రూ.315, కనిష్టంగా ధర రూ.65 లభించింది. వేలంలో 10 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

వేగం రాక్షసమై.. క్షణం నిశ్శబ్దమై..

రోడ్డుపై రాక్షసం.. మమతల బంధాన్ని మింగేసింది. రోడ్డుపై చెల్లా చెదురుగా పడి ఉన్న తల్లి, తండ్రి, బిడ్డ మృతదేహాలు. లారీ ఈడ్చుకుపోవడంతో నుజ్జైన శరీర భాగాలు. పక్కనే గుక్కపట్టి ఏడుస్తున్న చిన్నారి. మృతదేహాల పక్కనే చిన్నారుల తినుబండారాలు, పెన్ను చూసిన ప్రతి ఒక్కరి గుండె బరువెక్కింది. ఆ దృశ్యం భీతావహంగా మారింది. ఒక్క క్షణంలోనే.. ఓ కుటుంబం చిదిమిపోయింది. అతివేగం ఆ ప్రాణాలను కబళించింది. బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. బంధువుల వివాహానికి వచ్చి, తిరిగి వెళ్లేందుకు సన్నాహాలు చేస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది.

కుటుంబాన్ని కబళించిన అతివేగం

- భార్యాభర్తలతో ఓ కుమార్తె దుర్మరణం
- తీవ్రగాయాలతో అనాథగా మిగిలిన చిన్న కుమార్తె



భీతావహంగా ఉన్న ఘటనా స్థలం



ఒకే స్ట్రెచర్‌పై తల్లికుమార్తె మమత, వైభ మృతదేహాలు



తల్లిదండ్రులు, అక్క మృతదేహాల వద్ద గుక్కపట్టి ఏడుస్తున్న చిన్నారి మేఘన

కలిగిరి: భార్య, భర్త, ఇద్దరు బిడ్డలు. ఉన్నంతలో ఆనందంగా సాగిపోతున్న ఆ కుటుంబాన్ని విధి వేటాడింది. మరి కొద్ది సేపట్లో ఇంటికి చేరుతారనే సమయంలో మితిమీరిన వేగంతో ఎదురుగా రాంగ్ రూట్‌లో దూసుకొచ్చిన బోర్‌వెల్ లారీ ముగ్గురిని కబళించింది. ఇంటికి సరుకులు, చిన్నారులకు తినుబండారాలు తీసుకుని బైక్‌పై వెళ్తున్నారు. మండలంలోని తూర్పుదూబగుంట ఎస్సీ కాలనీకి చెందిన చవలముడి బాబు (30) బతుకుదెరువు నిమిత్తం భవన నిర్మాణ పనులు చేస్తూ కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. బంధువుల వివాహం ఉండడంతో గత నెలలో స్వగ్రామానికి వచ్చాడు. మళ్లీ పనులకు వెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం సరుకులు కొనేందుకు భార్య మమత (27), పెద్ద కుమార్తె వైభ (6), చిన్న కుమార్తె మేఘనతో కలిసి బైక్‌పై కలిగిరికి వెళ్లి తిరిగి స్వగ్రామం వెళ్తున్నాడు. కుదుములదిన్నెపాడులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ప్రధాన రహదారిపై ఎదురుగా వచ్చిన బోర్ వెల్స్ లారీ రాంగ్‌రూట్‌లో బైక్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి జారి కింద పడడంతో లారీ చక్రాలు వారిని ఈడ్చుకుంటూ వెళ్లింది. ఈ ప్రమాదంలో దంపతులు బాబు, మమత, పెద్ద కుమార్తె వైభ అక్కడికక్కడే మృతి చెందారు. చిన్న కుమార్తె మేఘన తీవ్రంగా గాయపడింది.

భీతావహ పరిస్థితి

లారీ ఈడ్చుకెళ్లడంతో మృతుల శరీర భాగాలు నుజ్జునుజ్జు కావడతో భీతావహ పరిస్థితి నెలకొంది. తీవ్రంగా గాయపడిన చిన్నారి మేఘనను 108 వాహనంలో కావలికి తరలించారు. బాబు ఇంటికి తీసుకెళ్తున్న నిత్యావసర సరుకులు, చిన్నారుల తినుబండరాలు మృతదేహాల పక్కనే పడి ఉన్నాయి. ప్రమాదం విషయం తెలుసుకుని తూర్పుదూబగుంట నుంచి మృతుల బంధువులు, గ్రామస్తులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలు పడి ఉన్న తీరు చూసి అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరిని కలిచి వేసింది. చిన్నారి వైభ మృతదేహం పక్కనే పెన్ను పడి ఉండడం చూసి బంధువులు రోదించారు. పోస్టుమార్టం నిమిత్తం ఒకే స్ట్రెచర్‌పై తల్లి, కుమార్తె మృతదేహాలను అంబులెన్స్‌లో తరలించడం హృదయవిధారకంగా కనిపించింది.

కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రమాద స్థలాన్ని ఉదయగిరి సీఐ వెంకటరావు, వింజమూరు ఎస్సై వీరాప్రతాప్, కలిగిరి ఏఎస్సై రామచంద్రయ్య సందర్శించారు. మృతదేహాలను పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన బోర్‌వెల్స్ లారీ డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్ కుమార్తెపై లైంగిక దాడి కేసులో తండ్రికి జీవిత ఖైదు

నెల్లూరు (లీగల్): తాగిన మత్తులో వావివరసలు మరిచి, కన్న కుమార్తె (మైనర్)ను బెదిరించి లైంగిక దాడి చేసి గర్భవతిని చేసినట్లు నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడైన తండ్రి కర్ర బాలరాజుకు జీవిత ఖైదుతోపాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. జలదంకి మండలం హనుమకొండ గ్రామానికి చెందిన నిందితుడు బాలరాజు బేల్దారి పనులు చేస్తూ ఉంటాడు. ఆయన భార్య కూలీ పనులకు ఉదయం వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేది. వీరి కుమార్తె స్కూల్‌లో 10వ తరగతి చదువుతుండేది. ఈ నేపథ్యంలో 2019 మే 18న మధ్యాహ్నం బాలిక ఇంట్లో ఉండగా తండ్రి బాలరాజు మద్యం మత్తులో ఇంటికి వచ్చి బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత కూడా పలుసార్లు లైంగిక దాడి చేశాడు. బాలిక అనారోగ్యం ఉండడంతో తల్లి ఆస్పత్రికి తీసుకెళ్లింది. వైద్య పరీక్షలు చేయగా, గర్భిణీగా నిర్ధారణ అయింది. దీంతో బాలికను తల్లి ప్రశ్నించడంతో జరిగిన విషయాలను వెల్లడించింది. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు జలదంకి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కర్ర బాలరాజుపై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో పై మేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ దూబిశెట్టి చంద్రశేఖర్ వాదించారు.

ఇద్దరికి ప్రాణం పోసి..



మృతదేహాన్ని ఘనంగా సాగనంపుతున్న వైద్య బృందం, సిబ్బంది



మల్లికార్జున అవయవాలను తరలిస్తున్న వైద్యులు



మల్లికార్జున (ఫైల్)

- బ్రెయిన్ డెడ్‌తో మల్లికార్జున మృతి
- అవయవదానంతో రెండు కుటుంబాల్లో ఆనందం
- మరణాంతరం మానవత్వానికి మల్లికార్జున నిలువెత్తు నిదర్శనం

ఇందుకూరుపేట: బ్రెయిన్ డెడ్‌కు గురై తిరిగి రాని లోకాలకు వెళ్లి కుటుంబాన్ని శోక సముద్రంలో నింపిన ఆయన ఇద్దరు జీవితాల్లో వెలుగునింపి సజీవంగా నిలిచారు. మరణానంతరం మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచాడు. ఇందుకూరుపేటకు చెందిన మాచవరం మల్లికార్జున (53) టైల్స్ పని చేసుకొంటూ జీవనం సాగించేవాడు. భార్య అమరావతి ఇంట్లోనే ఉంటుంది. పెద్ద కొడుకు కార్తీక్, ఎంసీఏ (ఎస్వీ యూనివర్సిటీ, తిరుపతి) మొదటి సంవత్సరం చదువుతుండగా, చిన్నకొడుకు వివేక్ ఐటీఐ పూర్తి చేసి నెల్లూరులో కారు మెకానిక్ పని నేర్చుకొంటున్నాడు. పేద కుటుంబం అయిన మల్లికార్జున ఉన్న దాంట్లో బిడ్డలను చదివించుకొంటూ బతుకీడుస్తున్నాడు. ఈ నెల 12న నిద్ర లేచే సరికే కాళ్లు చేతులు సరిగా కదిలించలేకపోవడంతో కుటుంబ సభ్యులు నెల్లూరులోని పీపీసీకి తరలించారు. అక్కడ ఒక రోజు పాటు వైద్యం అందించి బ్రెయిన్ స్ట్రోక్ అని పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని చెప్పడంతో హుటాహుటిన కిమ్స్ వైద్యశాలకు తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు మల్లికార్జునకు సీవీఏ ఇస్కిమిక్ స్ట్రోక్, ఎడమ వైపు ఉన్న మిడిల్ సెరిబ్రల్ అర్జరీ (ఎంసీఏ)లో పెద్ద స్ట్రోక్, పెరిగిన ఇంట్రాక్రానియల్ ప్రెజర్ లేదా పుర్రె లోపల ఒత్తిడి పెరగడం, మెదడు మధ్య రేఖ నుంచి పక్కకు జరగడం, ఎడమ వైపు డీకంప్రెసివ్ క్రానియోటమీ, అధిక రక్తపోటు ఉన్నట్లు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అయినా చివరి ఆశగా కుటుంబ సభ్యులు సర్జరీ చేయాలని కోరారు. దీంతో డాక్టర్ ఉదయ్‌కిరణ్ సర్జరీ చేశారు. అనంతరం అబ్జర్వేషన్‌లో ఉన్న సమయంలో బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. వైద్య బృందం అవయవదాన ప్రాముఖ్యతను కుటుంబ సభ్యులకు తెలియజేశారు. దీంతో వారు మనస్ఫూర్తిగా అంగీకరించడంతో విషయాన్ని జీవన్‌దాన్ సంస్థకు తెలియజేశారు. ప్రోటోకాల్ ప్రకారం అవయవాల కేటాయింపునకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జీవన్‌దాన్ సంస్థ అవయవాలను కర్నూల్‌లోని హాస్పిటల్‌కు లివర్, ఒక కిడ్నీని నెల్లూరులోని హాస్పిటల్‌కు తరలించారు. మరణించిన పలువురు జీవితాల్లో వెలుగును నింపిన మల్లికార్జున మృతదేహానికి కిమ్స్ వైద్యశాల వైద్య బృందం, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. మృతదేహం స్వగ్రామం ఇందుకూరుపేటకు చేరడంతో పలువురు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. మల్లికార్జున అవయువాలను దానం చేసేందుకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను మండల వాసులు, జిల్లా వాసులు అభినందించారు.

నేటి నుంచి రీచ్‌లో తవ్వకాలు

నెల్లూరు (టౌన్): జిల్లాలో ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు, రవాణా నిషేధం పూర్తయిన సందర్భంగా గురువారం నుంచి సెమీ మెకనైజ్డ్ రీచ్‌లు/ ఓపెన్ రీచ్‌లు పల్లిపాడు, అప్పారావుపాళెం, మినగల్లు, విరువూరు రీచ్‌ల్లో ప్రభుత్వం నిర్ణయించిన లోడింగ్ చార్జీలు చెల్లించి ఇసుకను తెచ్చుకోవచ్చని మైనింగ్ శాఖ డీడీ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోతిరెడ్డిపాళెం (నెల్లూరు బ్యారేజీ), సంగం స్టాక్ యార్డు, సూరాయపాళెం -1 యార్డు, కలువాయ రాజుపాళెం డీసిల్టేషన్ పాయింట్లలో ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించి ఇసుకను తెచ్చుకోవచ్చన్నారు. పెన్నానది పరీవాహక గ్రామాల ప్రజల సొంత అవసరాల నిమిత్తం గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుని లేదా ఇసుక పోర్టల్‌లో నమోదు చేసుకుని యంత్రాలు ఉపయోగించకుండా మనుషుల ద్వారా తవ్వకాలు జరిపి టైరు బండ్లు, ట్రాక్టర్లు ద్వారా రసీదు చూపించి ఉచితంగా ఇసుకను తెచ్చుకోవచ్చన్నారు. ఈ ఇసుకను బయట ప్రాంతాలకు రవాణా చేయకూడదన్నారు. ఇసుక రవాణా వాహనాలకు తప్పనిసరిగా ఉచిత ఇసుక రవాణా వాహనం బ్యానర్‌తోపాటు జీపీఎస్ కలిగి ఉండాలన్నారు. ఉచిత ఇసుక తవ్వకం, రవాణా సమయం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అనుమతించనున్నట్లు చెప్పారు. నిబంధనలు పాటించని ఇసుక రవాణా వాహనదారులు, వినియోగదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ట్రాన్సిట్ ఫారం, పర్మిట్ లేకుండా ఇసుక రవాణా చేసే ఏ వాహనం అయినా బ్లాక్ లిస్టులో పెట్టడంతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, జరిమానా విధిస్తామని తెలిపారు. జిల్లాలో రాబోయే ఏడాదికి మొత్తం 24,58,471 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంటుందన్నారు. ఇందులో డీసిల్టేషన్ పాయింట్లల్లో 14,53,000 మెట్రిక్ టన్నులు, సెమీ మెకనైజ్డ్ /ఓపెన్ రీచ్‌ల్లో 7,03,500 మెట్రిక్ టన్నులు, మాన్సూన్ స్టాక్ యార్డుల్లో 86,777 మెట్రిక్ టన్నులు, కొత్త ఓపెన్ రీచ్‌ల్లో 2,15,194 మెట్రిక్ టన్నులు ఇసుక లభ్యమవుతుందన్నారు.

ప్రయాణికులకు నరకం

- జీఎస్టీ సూపర్ సేవింగ్స్ సభకు బస్సుల తరలింపు
- అవస్థలు పడుతున్న జనం
- కూటమి ప్రభుత్వంలో ఇది మామూలే..
- నాలుగు పర్యాయాలు సభలకు బస్సుల వినియోగం
- ఇప్పటికి ఒక్కదానికే అద్దె చెల్లింపు


వెలవెలబోతున్న ప్రధాన ఆర్టీసీ బస్టాండ్


నెల్లూరులోని ప్రధాన బస్టాండ్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

నెల్లూరు సిటీ: కూటమి ప్రభుత్వ వ్యవహరిస్తున్న తీరుతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. సభలంటే చాలు ఆర్టీసీ బస్సుల్ని తరలించేస్తున్నారు. దీంతో బస్టాండ్లలో జనం ఎదురుచూపుల్లో ఉండిపోతున్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండే ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు ఎవరైనా వినియోగించాలంటే అద్దె తప్పనిసరిగా ముందుగా చెల్లించాలి. అయితే కూటమి పెద్దలు ఆర్టీసీని తమ సొంత సంస్థగా భావించి బస్సులను యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. అద్దె చెల్లింపులు బకాయిలు పెట్టడంతో ఆర్టీసీకి తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

పెద్ద సంఖ్యలో..

జిల్లాలో మొత్తం 7 డిపోలున్నాయి. నెల్లూరు 1 డిపో, 2 డిపో, ఆత్మకూరు, కందుకూరు, కావలి, రాపూరు, ఉదయగిరి డిపోలున్నాయి. అన్నింట్లో 642 బస్సులున్నాయి. కూటమి ప్రభుత్వం నిర్వహించే సభలకు పెద్ద సంఖ్యలో వాహనాలను తరలిస్తున్నారు. ఇప్పటికి నాలుగు పర్యాయాలు కూటమి ప్రభుత్వం వివిధ సభలకు బస్సులను తీసుకెళ్లింది. అందులో మహానాడు సభకు మాత్రమే నగదు చెల్లించినట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. మిగిలిన వాటికి సంబంధించి నగదు చెల్లింపులపై స్పందన లేదు.

ప్రైవేట్ వాహనాలే దిక్కు

ప్రధాని నరేంద్రమోదీ గురువారం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటిస్తారు. ఓర్వకల్లు మండలం నన్నూరు సమీపంలో జరిగే జీఎస్టీ.. సూపర్ సేవింగ్ సభలో ప్రధాని పాల్గొంటారు. దీనికి సంబంధించి కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం బుధవారం 250 బస్సులను తరలించారు. దీంతో ఆర్టీసీ డిపోల్లో స్వల్ప సంఖ్యలో బస్సులు కనిపించాయి. గ్రామాల నుంచి నెల్లూరుకు, నగరం నుంచి పట్టణాలు, ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. అడపాదడపా వచ్చే బస్సుల కోసం గంటల తరబడి డిపోల్లో వేచిచూడాల్సి వచ్చింది. వచ్చిన వాటిని ఎక్కేందుకు అష్టకష్టాలు పడ్డారు. ఓవైపు వర్షం, మరోవైపు ఊర్లకు వెళ్లేందుకు ఆలస్యం కావడంతో ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయించారు. దూర ప్రాంతవాసులు రెండు, మూడు ఆటోలు మారి గమ్యస్థానం చేరుకోవాల్సి వచ్చింది.

ముందు జాగ్రత్తలు తప్పనిసరి

ఈ ఏడాది మే 4వ తేదీన అమరావతి రాజధాని పునఃప్రారంభ సభకు జిల్లా నుంచి 290 బస్సులను తరలించారు. మే 30వ తేదీన కడపలో జరిగిన టీడీపీ మహానాడుకు 263 బస్సులను, సెప్టెంబర్ 10వ తేదీన అనంతపురంలో సూపర్ సిక్స్ – సూపర్‌హిట్ బహిరంగ సభకు 260 బస్సులను తీసుకెళ్లారు. తాజాగా కర్నూలు జిల్లాలో జరిగే సభకు 250 బస్సులు పంపారు. కూటమి ప్రభుత్వం సభలు నిర్వహిస్తోందంటే ప్రయాణికులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సభ నిర్వహించే ముందురోజు, ఆరోజు ప్రయాణాలు పెట్టుకోకుండా ఉండాల్సిందే. విద్యార్థులు, ఉద్యోగులు ప్రత్యామ్నాయ మార్గం చూసుకోవాల్సిన స్థితి వచ్చింది.


తిరుపతికి వెళ్లే బస్సు ఎక్కేందుకు జనం పాట్లు


గూడూరు బస్సు ఎక్కేందుకు కష్టాలు పడుతూ..


బస్సుల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు


ఆటో ఎక్కి వెళ్లిపోదాం..

మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ..


లాడ్జీలో రికార్డులు పరిశీలిస్తున్న బాలాజీ నగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు


వాహన పత్రాలను పరిశీలిస్తున్న నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ

- జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు
- 30 మందిపై కేసుల నమోదు

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎస్పీ అజిత ఆదేశాలతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు లాడ్జీలు, వాహన తనిఖీలు నిర్వహించారు. బహిరంగ మద్యసేవనం చేస్తున్న వారిపై 27 కేసులు నమోదు చేశారు. 2,139 వాహనాలు తనిఖీ చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 30 మందిపై కేసులు పెట్టారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనులపై 258 కేసులు నమోదు చేసి రూ.1,43,810ల అపరాధరుసుము విధించారు. 13 వాహనాలు సీజ్ చేశారు. 63 లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బసచేసిన వారి వివరాలను సేకరించారు. రికార్డులను పరిశీలించారు. లాడ్జీ పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బసచేసే వారి వివరాలను క్రమం తప్పకుండా స్థానిక పోలీసులకు అందజేయాలన్నారు. అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. నేర నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రజలందరూ సహకరించాలని ఈ సందర్భంగా ఎస్పీ కోరారు. ప్రజలు తమ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తిసే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు తెలియజేయాలని కోరారు.


డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేస్తూ..

మార్కెట్లోకి మారుతి న్యూ విక్టోరిస్ విడుదల



నెల్లూరు(టౌన్): స్థానిక భార్గవి ఆటోమొబైల్స్ షోరూంలో బుధవారం యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ బి.శ్యామ్‌ప్రసాద్ చేతుల మీదుగా మారుతి న్యూ విక్టోరిస్ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారు అత్యాధునిక టెక్నాలజీతో ఉందన్నారు. భార్గవి ఆటోమొబైల్స్ చైర్మన్ కొండా బలరామిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఈ కారు డైనమిక్ ఇన్ మోషన్ డిజైన్‌తో అద్భుతంగా ఉందన్నారు. ఇందులో 4 ఇంజిన్ ఆప్షన్లతో స్మార్ట్ హైబ్రిడ్, స్ట్రాంగ్ హైబ్రిడ్, ఎస్.సీఎన్‌జీలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. పది రంగుల్లో లభ్యమవుతుందన్నారు. ప్రారంభ ధర రూ.10.49 లక్షల నుంచి రూ.19.99 లక్షల వరకు ధర ఉందన్నారు. కార్యక్రమంలో ఈడీ కొండా ఈశ్వర్, సీజీఎం రవికుమార్, జీఎం సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వినతులిచ్చినా పట్టించుకోలేదు

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

సోమశిల: అనంతసాగరం మండలం సంజీవనగరం గ్రామానికి చెందిన గంగు నారాయణ, అతని తమ్ముడు ఎర్రగంగు, కుటుంబ సభ్యులు బుధవారం అనంతసాగరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం తమకు జగనన్న లేఅవుట్‌లో 20వ నంబర్ ప్లాట్‌ను కేటాయించిందన్నారు. తమ ప్లాట్ నంబర్‌తో ఫాతిమా అనే మహిళకు అధికారులు పట్టా ఇచ్చారని ఆరోపించారు. దీనిపై ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయంలో వినతులిచ్చినా పట్టించుకోలేదన్నారు. దీనిపై తహసీల్దార్ జయవర్ధన్ మాట్లాడుతూ సాంకేతిక సమస్య వల్ల ఇలా జరిగిందన్నారు. హౌసింగ్‌లో ఇద్దరి లబ్ధిదారుల పేర్లు నమోదైనట్లు చెప్పారు. ఫాతిమా కుటుంబం ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేస్తున్నందున నారాయణ ఒప్పుకొంటే మరో ప్లాట్‌ను ఇస్తామన్నారు.


ధర్నా చేస్తున్న నారాయణ కుటుంబం

టీచర్, విద్యార్థి ఎంపిక

సంగం: మండలంలోని సంగం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి యశ్వంత్, సాంఘిక శాస్త్ర టీచర్ టి.సుబ్రహ్మణ్యం గురువారం కర్నూలు జిల్లాలో జరిగే జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ సభలో ప్రధాని నరేంద్రమోదీతో ఇంట్రాక్షన్‌కు ఎంపికయ్యారు. జీఎస్టీ సంస్కరణలపై 13వ తేదీ జరిగిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన యశ్వంత్‌ను, ట్రైనింగ్ ఇచ్చిన టీచర్‌ను జిల్లా నుంచి ఎంపిక చేశారు. వారు కర్నూలుకు వెళ్లారు. బుధవారం ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.


ఎంపికైన వారితో ఉపాధ్యాయులు

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


రమేష్ మృతదేహం

మనుబోలు: ఓ విద్యార్థి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని జట్ల కొండూరులో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. జట్ల కొండూరు దళితవాడకు చెందిన కసుమూరు రాఘవయ్య, ప్రమీలమ్మ దంపతుల కుమారుడు కసుమూరు రమేష్ (19) కాకినాడ సమీపంలోని సూరాయపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. గతేడాది రెండో సంవత్సరం మధ్యలో ఆపేసి అక్కడ ఉండలేనంటూ జట్ల కొండూరుకు వచ్చేశాడు. ఆపై మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరి పరీక్షలు రాసేందుకు ప్రయత్నించగా సాంకేతిక కారణాలతో వీలుకాదని అధ్యాపకులు తెలిపారు. మళ్లీ వెళ్లి సూరాయపాళెంలో ఫీజు కట్టి హాల్‌టికెట్ వచ్చినా పరీక్షలు రాయలేదు. దీంతో అతను తీవ్ర మానసికవేదనతో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం వెతకగా కాగితాలపూరు సమీపంలోని జామాయిల్ తోటలోని వేపచెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న ఎస్సై శివ రాకేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

ప్రసన్న సంఘీభావం

కోవూరు: కల్తీ మద్యంపై 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైన నేపథ్యంలో నమోదైన కేసుల్లో నోటీసులు అందుకుని పోలీసుల విచారణకు హాజరైన నెల్లూరు బ్యూరో ఇన్‌చార్జి, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి చిలకా మస్తాన్‌రెడ్డిని ఆయన నివాసంలో బుధవారం మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కలిసి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు వెలుగులోకి తీసుకొచ్చేందుకు పాత్రికేయులు కృషి చేస్తారన్నారు. వారిపై ఒత్తిళ్లు, కేసులు నమోదు చేయడం తగదని అభిప్రాయపడ్డారు. ఎల్లప్పుడూ 'సాక్షి' ప్రజల పక్షాన, వారికి అండగా నిలబడుతుందని స్పష్టం చేశారు. ప్రసన్న వెంట సీనియర్ నాయకుడు కలువ బాలశంకర్‌రెడ్డి, అనుబంధ సంఘాల నాయకుడు చేజర్ల సుధాకర్‌రెడ్డి ఉన్నారు.


మస్తాన్‌రెడ్డితో మాట్లాడుతున్న ప్రసన్న

సీనియర్ అసిస్టెంట్‌కు పదోన్నతి

నెల్లూరు రూరల్: జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గుండాబత్తిన సువర్ణ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొంది ఒంగోలు ప్రాంతీయ కార్యాలయానికి బదిలీ అయ్యారు. బుధవారం నెల్లూరులోని కార్యాలయంలో ఆత్మీయ అభినందన సభను ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సువర్ణ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీఈ శివశంకర్ రావు, డివిజనల్ పీఆర్వో రవికుమార్, ఏపీఆర్వో రవీంద్రబాబు, సీనియర్ అసిస్టెంట్ ఖాదర్‌మస్తాన్, పీఆర్వో వినోద్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సువర్ణను సత్కరించిన అధికారులు

స్కాన్ చేశాకే విక్రయించాలి

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ శంకరయ్య

నెల్లూరు(క్రైమ్): బార్, మద్యం దుకాణాల యజమానులు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా బాటిళ్లను స్కాన్ చేసిన అనంతరమే విక్రయించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శంకరయ్య తెలిపారు. బుధవారం ఎక్సైజ్ నెల్లూరు – 1 స్టేషన్‌లో నగరంలోని బార్లు, మద్యం దుకాణాల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించి యాప్ పనితీరుపై అవగాహన కల్పించారు. స్కాన్ చేయకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం విక్రయించరాదని స్పష్టం చేశారు. బెల్టు షాపులు నిర్వహించడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి చర్యలు గుర్తిస్తే లైసెన్సు రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం నగరంలోని లక్కీ వైన్ షాపులో యాప్ వినియోగాన్ని పరిశీలించారు. సమావేశంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏఈఎస్ రమేష్, నెల్లూరు – 1 ఇన్‌స్పెక్టర్ పి.రమేష్‌బాబు, ఎస్సైలు ప్రభాకర్‌రావు, డి.శ్రీధర్, జేకేవీఎన్ మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


యాప్ పనితీరుపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు

పెళ్లి పేరుతో మోసం

- రూ.80 లక్షల మేర వసూలు చేసిన మహిళ

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తిని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలు దఫాలుగా సుమారు రూ.80 లక్షలు తీసుకుని మోసగించిన మహిళపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నగరానికి చెందిన నాని ఆన్‌లైన్ ట్రేడింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి 2022లో ఆన్‌లైన్‌లో కాకినాడకు చెందిన అలేఖ్యతో పరిచయమైంది. ఇద్దరు రెండు నెలల పాటు సాధారణ చాటింగ్ చేసుకుంటూ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. అనంతరం ఏమైందో గానీ ఏడాది వరకు ఆమె మాట్లాడలేదు. 2023లో ఇంట్లో నుంచి వచ్చేస్తానని, తనకు ఓ ఉద్యోగం కావాలని నానికి ఫోన్ చేసి అడిగింది. దీంతో అతను ఆమెకు ట్రేడింగ్ చేయడం నేర్పించాడు. ఇద్దరి మధ్య స్నేహం కాస్తా ప్రేమగా మారింది. అప్పటి నుంచి ఆమె అతడి వద్ద నగదు తీసుకోసాగింది. చదువు కోసం రూ.3 లక్షలు, హైదరాబాద్‌లో ఉద్యోగం కోసం రూ.9 లక్షలు తీసుకుంది. ఈ క్రమంలోనే ఆమె తన తల్లి, బావలను పరిచయం చేసింది. తాము పెళ్లి చేసుకుంటామని చెప్పడంతో వారు అంగీకరించారు. పుట్టినరోజు పేరిట రూ.5 లక్షల బంగారు ఆభరణాలు, ఆరోగ్యం బాగోలేదని చెప్పి విడతల వారీగా రూ.24 లక్షలు తీసుకుంది. పెళ్లి చేసుకుందామని అడిగితే వాయిదా వేస్తూ కాలయాపన చేస్తుండగా నానికి అనుమానం వచ్చి ఆరాతీయగా అసలు విషయం తెలిసి నిర్ఘాంతపోయాడు. సదరు యువతికి అప్పటికే బావతో వివాహమైందని, అందరూ కలిసి తన వద్ద సుమారు రూ.80 లక్షల వరకు తీసుకుని మోసగించారని గుర్తించాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు బుధవారం నమోదు చేశారు.

పురుగు మందుల దుకాణంపై విజిలెన్స్ దాడులు

పొదలకూరు: పట్టణంలోని సతీష్ రైతు డిపో పురుగు మందుల దుకాణంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. వారికి అందిన సమాచారం మేరకు పురుగు మందుల దుకాణం గోదామును విజిలెన్స్ సీఐ శ్రీహరి ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాములో రూ.5.11 లక్షల విలువైన 384 లీటర్ల బయో ప్రొడక్ట్స్, రూ.4.93 లక్షల విలువైన 738.25 లీటర్లకు సంబంధించి రికార్డులు సక్రమంగా లేని పురుగు మందులు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ మేరకు రైతు డిపో యజమానిపై క్రిమినల్ కేసుతో పాటు 6ఏ కేసును నమోదు చేస్తామని వెల్లడించారు. దాడుల్లో విజిలెన్స్ ఏఓ వేణుగోపాల్, ఏఓ వి.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో..

- రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

కోవూరు: రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పడుగుపాడు రైల్వే స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. కోవూరు మండలం గంగవరానికి చెందిన అబ్దుల్ రెహమాన్ (20) నెల్లూరులో చదువుకుంటున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన అతను బుధవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి పడుగుపాడు రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నాడు. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ట్రాక్‌కు సమీపంలో బైక్ ఉంది. దానిపై నసీరా – అబ్దుల్ అనే పేరు రాసి ఉన్నాయి. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	రూ.125
లేయర్	రూ.122
బ్రాయిలర్ చికెన్	రూ.226
స్కిన్‌లెస్ చికెన్	రూ.250
లేయర్ చికెన్	రూ.207

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	రూ.30
సన్నవి	రూ.20
పండ్లు	రూ.10

ఐదు షాపులపై కేసుల నమోదు

నెల్లూరు(అర్బన్): తూనికలు, కొలతల శాఖాధికారులు బుధవారం నెల్లూరు నగరంలోని పలు రకాల వ్యాపార దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆ శాఖకు చెందిన నెల్లూరు ఇన్‌స్పెక్టర్ షేక్ రియాజ్ అహ్మద్, కావలి ఇన్‌స్పెక్టర్ మొహిసిన్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీకాంత్‌తోపాటు సిబ్బంది మైపాడు గేట్ సెంటర్‌లోని చేపల మార్కెట్, ఏసీ కూరగాయల మార్కెట్, కోనేరు ప్రాంతంలోని కూరగాయల మార్కెట్, పలు చికెన్ షాపుల్లో తనిఖీలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ఐదు షాపులపై కేసులు నమోదు చేశారు. చేపల వ్యాపారులు ఉపయోగిస్తున్న త్రక్కెడలో తేడాలుండటంతో స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు కాపాడేందుకు కృషి చేస్తున్నామన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రోడ్ల నిర్మాణాలపై ఈఎన్‌సీ ఆరా

నెల్లూరు(అర్బన్): ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ శేషుకుమార్ బుధవారం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఇటీవల నిర్మించిన రోడ్లు, ప్యాచ్ వర్క్‌లను పరిశీలించారు. అనంతరం నగరంలోని ఆర్‌అండ్‌బీ సర్కిల్ కార్యాలయానికి వచ్చిన ఈఎన్‌సీ ఇంజినీర్లతో సమావేశమయ్యారు. జిల్లాలో రహదారుల పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. విధుల్లో రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా పని చేయాలని సూచించారు. ఇటీవల 18 రోడ్లకు మంజూరైన రూ.73.4 కోట్ల నిధుల గురించి, త్వరలో చేపట్టబోయే వాటి పనుల గురించి చర్చించారు. గోతులున్న చోట కొత్తగా లేయర్ నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్లకు ప్యాచ్‌వర్క్‌లు, నూతన రోడ్లు వేసే సమయంలో తయారు చేసే ఎస్టిమేషన్‌లు పక్కాగా ఉండాలన్నారు. ఆశాఖ పరిధిలో గతంలో మంజూరై ఆగిన రోడ్ల నిర్మాణాలు, కాంట్రాక్టర్లు సకాలంలో ఎందుకు పూర్తి చేయలేకపోయారో, వారిపై తీసుకున్న చర్యలు ఏమిటంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో సర్కిల్ ఎస్ఈ డాక్టర్ గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం

- రూ.2 లక్షల ఆస్తి నష్టం

పొదలకూరు: మండలంలోని విరువూరు గ్రామంలో బుధవారం వంట గ్యాస్ సిలిండర్ ప్రమాదవశాత్తు పేలి పూరిల్లు దగ్ధమైంది. మంటలు పక్క ఇళ్లకు వ్యాపించకుండా అగ్నిమాపక అధికారులు ఆర్పివేశారు. వివరాలు.. కొండమ్మ పూరింట్లో నివాసముంటున్నారు. ఆమె గ్యాస్ స్టౌ అంటించి సక్రమంగా ఆర్పలేదు. గ్యాస్ లీకై మండుకుని సిలిండర్ పేలింది. ఆ సమయంలో కొండమ్మ ఇంట్లో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మంటలకు ఇల్లు పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని చెబుతున్నారు. బాధితురాలు కట్టుబట్టలతో మిగిలి నట్టు కన్నీంటి పర్యంతమైంది. పొదలకూరు అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.


కాలిపోయిన ఇల్లు